క్లుప్తంగా

రోడ్డు బాగుచేయండి



రోడ్డుపై భారీ గుంతలో నిలిచిన వర్షపునీరు

విజయనగరం: స్థానిక అయ్యన్నపేట పశ్చిమ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లే మార్గంలోని రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడి రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పొడవునా గుంతలు ఉన్నాయని, చిన్నపాటి వర్షమొస్తే చాలు నీరు ఆ గుంతల్లో ఉండిపోతోందన్నారు. అధికారులు స్పందించి, రోడ్డులోని గొయ్యిలను పూడ్చివేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు



మొయిద హాస్టల్‌ను సందర్శిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద, బొప్పడాం, అలుగోలు గ్రామాల్లోని వసతిగృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ పరిసరాలు సహా విద్యార్థుల గదులు, బెడ్లు, వంటగది పరిశీలించారు. మొయిద హాస్టల్ ప్రహరీ కూలినట్లు గుర్తించిన ఆయన.. పాఠశాల పునఃప్రారంభం నాటికి గోడ నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మొయిద వసతి గృహ సంక్షేమ అధికారి కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్ లైన్ మరమ్మతులు సహా విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, వెంకన్నపాలెం, మల్యాడ గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

5న ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆరోజు ఉదయం 5 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, వజ్రకిరీట ధారణ, బంగారుచీరతో అలంకరణ, కుంకుమార్చనలు, హోమాలు వంటివి చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు



యోగా సాధన చేస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్: యోగాతో ఆరోగ్యం మెరుగవుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు అన్నారు. స్థానిక దాసన్నపేట విద్యుత్ భవన్ వద్ద మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి, యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం లక్ష్మీనారాయణ, ఎస్ఏవో అప్పలనాయుడు, ఈఈలు మురళీకృష్ణ, సురేష్‌బాబు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు సరే..అమలేదీ?

- నియోజకవర్గానికి ఎమ్మెల్యే నాగమాధవి హామీల వర్షం
- ఎన్నికల ముందు తర్వాత మాటలు కోటలు దాటాయి..
- చేతలు గడప కూడా దాటకపోవడంపై సర్వత్రా విమర్శలు
- ప్రశ్నిస్తే ఖజానా లేదనే సాకుతో తప్పించుకునే ప్రయత్నం
- ఏడాదైనా ఒక్కటీ నెరవేర్చకపోవడంపై జనం మండిపాటు



రామతీర్థంలో గ్రామీణ రోడ్డుపై మురుగు నీరు



నిర్మాణం పూర్తికాని రామతీర్థం గిరి ప్రదక్షిణ రోడ్డు



గోతులమయంగా నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి ఇలా..

నెల్లిమర్ల రూరల్:

మాటలు కోటలు దాటాయి..కానీ చేతలు గడప కూడా దాటడం లేదన్న చందంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి తీరు ఉంది. ఎన్నికల ముందు..తర్వాత..నియోజకవర్గ ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి ఆశచూపారు. తనను గెలిపిస్తే పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తా..గెలిచిన ఆరు నెలల్లోనే తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు తీరుస్తా.. గ్రామీణ రోడ్లు బాగు చేస్తా..రహదారులు విస్తరిస్తా.. అని వాగ్దానం చేశారు. తీరా చూస్తే అందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. గెలిచి, వారి పార్టీ అధికారంలోకి ఉండి కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హామీల అమలు పట్టాలెక్కించడానికి ఏడాదైనా సరిపోదా అని నిలదీస్తున్నారు.

డబ్బుల్లేవ్.. ఏం చేస్తాం..!

తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామమైన ఏటీ అగ్రహారంలో ఎన్నికల ప్రచార సమయంలో తనను గెలిపించండి మీ సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే నాగమాధవి మాటిచ్చారు. ఆమె గెలిచి ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీ గురించి పట్టించుకోకపోవడంతో ఇటీవల ఆ గ్రామపెద్దలంతా ఎమ్మెల్యేను కలిసేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అప్పుడు కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే వెళ్లిపోవడంతో ఆమె భర్త లోకం ప్రసాద్‌తో సమావేశమయ్యారు. పునరావాసంతో పాటు తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను అందించేలా చూడాలని వారు కోరగా.. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు ఏం చేస్తాం అని చెప్పారని ఆ గ్రామపెద్దలు చెబుతున్నారు. అవసరం ఉన్నప్పుడు ఒకలా.. అవసరం తీరాకా మరోలా మాట్లాడడం సరికాదని, హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఖజానా గుర్చి తెలీదా అని మండిపడుతున్నారు. తమకు నివాస స్థలాలు కేటాయించాలని లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తున్నారు.

గతంలోని పనుల కొనసాగింపు లేదు..

నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. రెండు జిల్లాలను కలిపే ఈ రహదారి విస్తరణను గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టారు. రామతీర్థం జంక్షన్ నుంచి కొత్తపేట, రామతీర్థం, సతివాడ, బొప్పడాం మీదుగా విస్తరణ పనులు చాలా చురుగ్గా సాగాయి. రణస్థలం నుంచి సతివాడ వరకు విస్తరణ పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ఎంబేరేయగుళ్ల గ్రామం నుంచి నెల్లిమర్ల జంక్షన్ వరకు కూడా పనులు బాగానే జరిగాయి. విస్తరణ పనుల్లో భాగంగా ఆరు మినీ కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తయింది. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేసి, రోడ్డు నిర్మాణం చేస్తారనే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం ప్రభుత్వం మారిపోవడం జరిగింది. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్డు అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం అలుముకుంది. రోడ్డు పనులు కొనసాగింపు చేపట్టకపోవడంతో కల్వర్టుల వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ వైపుగా ప్రయాణించేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. గెలిపిస్తే రోడ్లు బాగుచేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఎక్కడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రాళ్లు తేలిన రోడ్డులో భక్తుల పాదయాత్ర..

రామతీర్థం బోడికొండ చుట్టూ పక్కా రహదారి నిర్మాణానికి సుమారు ఏడు నెలల క్రితం ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవ సమయంలో మూడు నెలల్లోనే రహదారిని పూర్తి చేసి గత ముక్కోటి ఏకాదశికి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. అనుకున్న సమయానికి హామీ నెరవేరకపోవడంతో ముక్కోటి ఏకాదశి రోజున గిరి ప్రదక్షిణలో రాళ్లుతేలిన రహదారిలోనే భక్తుల పాదయాత్ర కొనసాగింది. రహదారి పనులు ప్రారంభించి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ఓ కొలిక్కి రాకపోవడమేంటని, మరీ ఇంత నిర్లక్ష్యమా అని భక్తులు కోపోద్రేకులవుతున్నారు.

100 రోజుల్లోనే ఉద్యోగాలిస్తానన్నారు ఏదీ?

ఎన్నికలకు ముందు తమ కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందని, తనను గెలిపిస్తే పరిశ్రమలు తెచ్చి, ఉద్యోగాలు ఇస్తానని ఎమ్మెల్యే నాగమాధవి నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారు. 100 రోజుల్లో 80 నుంచి 100 కంపెనీలను నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏర్పాటు చేయించి, 5 వేల ఉద్యోగాలు ఇస్తామని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇప్పటికీ ఏ ఒక్క పరిశ్రమ తేకపోగా ఉద్యోగాలేవీ అని నిరుద్యోగులు ప్రశ్నిస్తారేమోనన్న భయంతో ఎమ్మెల్యే యువత కంట కనపడకుండా తప్పించుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి..



తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. బాధిత గ్రామస్తులమంతా ఎమ్మెల్యేను కలిసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఇటీవల ఆమె భర్తను కలిసి మాట్లాడాం. 2008 నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికై నా న్యాయం చేయండి.

–జమ్ము రమణ, ఉప సర్పంచ్, ఏటీ అగ్రహారం గ్రామం

నరకయాతన పడుతున్నాం..



నెల్లిమర్ల-రణస్థలం రోడ్డులో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నాం. అసంపూర్తిగా పనులు ఉండిపోవడంతో బాగు చేసిన రోడ్డు కూడా పాడవుతోంది. కొన్నిచోట్ల విపరీతమైన గుంతలు ఉన్నాయి. గతుకుల రోడ్డులో వెళ్లాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. ఇబ్బందులు బాగా పడుతున్నాం. ఎమ్మెల్యే గారు ఇప్పటికైనా స్పందించాలి. ఎన్నికల వాగ్దానం అమలు చేయాలి.

–రేగాన శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఉపాధి పేరిట మోసం..



ఎన్నికల ప్రచారంలో ఊరూరా తిరిగి, ఎమ్మెల్యే లోకం నాగమాధవి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు వంద రోజుల్లోనే ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పుడు 365 రోజులైనా పరిశ్రమలు తీసుకురాలేదు. ఏ ఒక్కరికీ ఉద్యోగమివ్వలేదు. ఇప్పటికైనా నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా చొరవ తీసుకోవాలి.

–పంచాది శ్రీనివాసరావు, వల్లూరు గ్రామం

వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరండి



వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్యాసినాయుడు



పూసపాటిరేగ: సభాస్థలం పరిశీలనలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు తదితరులు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు పూసపాటిరేగ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన మండలంలోని కొండవెలగాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రజలకు సువర్ణపాలన అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు విస్మరిస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తుండడాన్ని వెన్నుపోటుగా భావిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకు పూసపాటిరేగ పోస్టాఫీసు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందివ్వడం జరుగుతుందన్నారు. నెల్లిమర్ల మండలం నుంచి 50 ఆటోల్లో కార్యకర్తల పయనానికి ఏర్పాట్లు చేశామన్నారు.

సభాస్థలం పరిశీలన..

పూసపాటిరేగ: మండల కేంద్రంలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి, స్థలాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. పోస్టాఫీసు సమీపంలోని స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన కాసేపు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి భారీగా పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీలు అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎస్.సత్యనారాయణరాజు, మహంతి జనార్థనరావు, మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ టొంపల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: నగరంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో జరిగే ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సీఎంఆర్ జంక్షన్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



ఉపాధ్యాయురాలు మహేశ్వరమ్మ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్: ఉద్యోగులకు ఉద్యోగ కాలంలో చేసిన సేవలే మంచి గుర్తింపును తెచ్చిపెడతాయని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ, రణస్థలం ఎంఈవో ఎ.త్రినాథరావు అన్నారు. రణస్థలం మండలం, ముక్కుపాలవలస గ్రామ ఉపాధ్యాయురాలు కనకదుర్గ మహేశ్వరమ్మ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయ సిబ్బంది, ఇతర అధికారులంతా మహేశ్వరమ్మ, నరసింహులు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వృత్తిలో చిత్తశుద్ధి, నిబద్ధత కనబరిచిన వారికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, మహేశ్వరమ్మ తన విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభ, బోధనా నైపుణ్యాలు, క్రమశిక్షణ ఆదర్శనీయమన్నారు. సర్వీసు మొత్తంలో అతి తక్కువ సెలవులు పెట్టారంటే ఆమెకు తన వృత్తి పట్ల ఉన్న మమకారం, అంకితభావం అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ ఈవో కేవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు పీబీ వర్మ, డాక్టర్ సన్యాసమ్మ, అప్పలనాయుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్: స్థానిక ప్రేమసమాజంలో ప్రేమసమాజం పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్రమంత్రి పూసపాటి గజపతిరాజు హాజరై, పుస్తకాన్ని విడుదల చేశారు. ఎంతోమంది నిరాశ్రయులైన వృద్ధులను ప్రేమసమాజం అక్కున చేర్చుకుని ఆదుకుంటుండడం అభినందనీయమని ఆయన అన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రేమసమాజం అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, కోశాధికారి బలివాడ అప్పారావు, ముఖ్య సలహాదారు వి.సుబ్బరాజు, సహాయ కార్యదర్శి సీహెచ్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



బొండపల్లిలో మలేరియాపై అవగాహన ర్యాలీ

బొండపల్లి: ప్రాణాంతక మలేరియా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ సూచించారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజరు ఎస్.ఎ.భాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న బాలల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక మూడు లాంతర్ల జంక్షన్ వద్ద చదురుగుడి దగ్గరున్న ఆధ్యాత్మిక కళావేదికపై శ్రీభగవతీ నృత్య కళామందిర్ డైరెక్టర్ వడ్లమాని రమణ కుమారి బృందం మంగళవారం చేసిన నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. ప్రధానంగా అయిగిరి నందిని అనే గీతానికి చేసిన నృత్యం ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఆలయ ఈవో ప్రసాద్, సూపర్‌వైజర్ ఏడుకొండలు దుశ్శాలువాలతో సత్కరించారు.

రాజుల చెరువుపై రోడ్డు నిర్మాణం నిలుపుదల



రాజుల చెరువులో రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయిస్తున్న తహసీల్దార్

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ రెవెన్యూ పరిధిలో గల రాజుల చెరువుపై నిర్మాణం చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు మంగళవారం పరిశీలించి నిలిపి వేశారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు తహసీల్దార్‌కు ఇటీవల నెలివాడ గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయాలని ఆదేశించినట్టు తెలిపారు. సర్వే నంబరు 6లో రాజులు చెరువులో అక్రమంగా రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్టు పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి సర్వే నిర్వహించి పనులను నిలుపుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ హరికృష్ణ, సర్వే సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్టాపర్ల ఏర్పాటు



నాలుగురోడ్ల కూడలిలో స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీస్ అధికారులు

గజపతినగరం రూరల్: రహదారి ప్రమాదాల నివారణకు మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో స్టాపర్లు ఏర్పాటు చేసినట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. మంగళవారం నాలుగురోడ్ల కూడలి వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహన వేగాలను నియంత్రించినట్టయితే ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని స్టాపర్లును ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు, పాదచారులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

• రేషన్ అవస్థలు





ప్రజలకు రేషన్ అవస్థలు మొదలయ్యాయి. ఇకనుంచి రేషన్ తీసుకోవాలంటే మళ్లీ రేషన్ దుకాణానికి వెళాల్సిందే..క్యూ కట్టాల్సిందే..జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో గోనె సంచులు పట్టుకుని ఎండలో నడుచుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తీరా అక్కడికి వెళ్లాక పెద్ద లైన్ ఉండడంతో రేషన్‌తో బయటపడేందుకు గంట కాలం పడుతోంది. కొన్నిచోట్ల రేషన్ కోసం వెళ్లినా షాపు తెరిచి ఉండకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ ఇచ్చిన రేషన్ విధానమే బాగుందని, ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన రేషన్ పంపిణీ తమకు నచ్చలేదని ప్రజలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. సులభం నుంచి కష్టతరానికి రావడమేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నిస్తున్నారు. మంగళవారం పలుచోట్ల వృద్ధులు తమ రేషన్ బియ్యం డీలర్ షాపు నుంచి ఇంటికి తీసుకువెళ్లేందుకు తమ మనవళ్లనో, వేరొకరినో బతిమాలాడుకుంటున్నారు. విజయనగరంలోని జొన్నగుడ్డిలో రేషన్ బియ్యం మోసుకుని వెళ్తున్న వ్యక్తి.. మధ్యాహ్నం 12 గంటలైనా లంకవీధిలో తెరవని రేషన్ డిపోను చిత్రంలో చూడొచ్చు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

'శోభా'యమానంగా యాత్ర



శోభాయాత్రలో సాగుతున్న ఎమ్మెల్సీ రఘురాజు, సిరిసహస్ర, సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు



ప్రత్యేక వాహనంలో తరలుతున్న పంచలోహమూర్తులు

శృంగవరపుకోట : మేజర్ పంచాయితీ ఎస్.కోట పట్టణం మంగళవారం మధ్యాహ్నం ఆధ్యాత్మికతతో అలరారింది. పెరుమాళ్ల వారి శోభాయాత్రతో 'కోట' శోభాయమానం అయ్యింది. పుణ్యగిరి క్షేత్రంలో పుణ్య తిరుమలగిరిలో రూపుదిద్దుకున్న పద్మావతి-గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రయాహ్నిక ప్రతిష్ఠాపన మహోత్సవంలో కొలువుదీరనున్న దేవతామూర్తుల పంచలోహ దేవతా మూర్తులు, సుదర్శనం, పూర్ణకళశాలను శోభాయాత్రలో వైభవంగా పట్టణం అంతటా ఊరేగించి, తీసుకొచ్చారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

మంగళవారం మధ్యాహ్నం 4గంటలకు పట్టణంలో షిర్డీసాయిబాబా గుడి నుంచి మేళతాళాలు, భాజాభజంత్రీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్త బృందాల కోలాటాలు, భజనల నడుమ పెరుమాళ్లు, అమ్మవార్లు, సుదర్శనం, పూర్ణకలశాలను ప్రత్యేక వాహనాల్లో ఆర్టీసీ కాంప్లెక్స్, దేవీ జంక్షన్, గాంధీబొమ్మ, ప్రకాశం మార్కెట్, దారగంగమ్మ ఆలయాల మీదుగా శోభాయాత్ర పుణ్యగిరి వరకూ కన్నుల పండువగా సాగింది. శోభాయాత్రలో ఎమ్మెల్సీ రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి, చిన్నశ్రీను సోల్జర్స్ ప్రెసిడెంట్ సిరిసహస్ర సహా పలువురు పెద్దలు, ఎంపీటీసీలు, భక్తులు హాజరయ్యారు.